# ఇమేజ్



**ఆంధ్రభూమి, 24 ఏప్రిల్ 1999**

'మన ప్రసాద్‌గాడి వైఫ్ వట్టి మమ్మీట, ఎప్పుడూ మన్త్రకాలు ముందేసుకుని కూర్చుంటుందట గానీ సరదాగా ఒక్కమాటేనా మాట్లాడదట వాడితో కూడా. అదే చెప్పుకుని అందరిదగ్గిరా ఏడుస్తుంటాడు'

'అందుకే -

భద్రం బీకేర్‌ఫుల్ బ్రదరూ-

భర్తగ మారకు బేచిలరూ'

. నవ్వులు... తన వెనక... తన మొహమ్మీద...

ఫ్రెండు ఎంగేజిమెంట్ పార్టీలో జరిగిన సంఘటనలు, తనమీద కామెంట్స్ గుర్తొచ్చి మనసు రగిలిపోతోంది ప్రసాదుకి.

'నువ్వూ ఉన్నావు ఎందుకు? ఆ వసంతగారిని చూడు, ఎంత సోషల్‌గా వుంటుందో, ఎంత మంది మధ్యవున్నా సెంటరాఫ్ ఎట్రాక్షన్ ఆమే. నవ్వుతూ నవ్విస్తూ ఎంత సరదాగా తిరుగుతుంది? ఇంటికొచ్చినవాళ్లని మాత్రం? ఎంతో ఆత్మీయులన్నట్టు ఆదరిస్తుంది. అలాంటి వాళ్లింటికి వెళ్లడానికి మొహమాటం అనిపించదు. వాళ్లు మనింటికొచ్చినా విసుగెయ్యదు...' ఇంటికి రాగానే భార్యమీద విరుచుకుపడ్డాడు.

అతని మాటల్ని పెద్దగా పట్టించుకోలేదు సుధ. అలా గొణుగుతూ వుండడం అతనికలవాటే. 'భార్య' అనే వ్యక్తి ఇలా వుంటే బావుణ్ణని అతనికి చాలాసార్లు అనిపిస్తుంది. ఆమెని ఎవరెవర్తోనో పోల్చుకుని అసంతృప్తి పడతాడు. మాటల్లో తన అసంతృప్తి వ్యక్తపరుస్తాడు. ఆమెని బహిరంగంగా విమర్శిస్తాడు. నొప్పిస్తాడు.

నేను చాలా ఫ్రాంక్. ఉన్నదున్నట్టు మొహంమీదే అనేస్తాను - అంటూ తను అనేవాటిని సమర్ధించుకుంటాడు.

ఐనా ఆమె ఆమెగానే వుండిపోతుంది తప్పించి అతని ఆకాంక్షల మూసలోకి వదిగిపోదు. ఒక్క మాటతోనో, ఒక్క వాక్యంతోనో తన వ్యక్తిత్వాన్ని ప్రకటించుకుంటుంది. ఇప్పుడూ అదే జరిగింది.

'ఆమె తత్వం అది' అంది కూల్‌గా.

'ఆమెని చూసి నువ్వు మారచ్చు గదా! గిరి గీసుకుని కూర్చుంటావు. ఇంట్లోనూ అంతే, బయటా అంతే ఎక్కడికెళ్ళినా నీతో చిరాకే. ప్రసాదరావు వైఫ్ చాలా రిజర్వుడ్ నెత్తిమీదుంటాయి ఆమెకి కళ్లు అంటారు మా ఫ్రెండ్స్. ఇక, వాళ్ళు మనింటికొచ్చినా అంతే. డ్రాయింగ్ రూమ్‌లో కూర్చోబెట్టి కప్పు టీ పోసి ఎప్పుడెళ్లిపోతారా అన్నట్టు చూస్తావు, ఛ..ఛ..నవ్వుతూ సరదాగా మాట్లాడ్డంరాని బతుకు నీదీ ఒక బతుకేనా?"

అతనంత రఫ్‌గా అనేసరికి సుధకి కంట్రోల్ తప్పింది. 'మా ఇంట్లో మమ్మల్నిలా పెంచారు.

ఏం చేద్దాం? మీక్కావలసిన లక్షణాలున్న అమ్మాయిని చేసుకోవాల్సింది. నాకూ చిరాగ్గానే ఉంది. ఎక్కడికేనా వెళ్లడమంటే మీతో భయం' అనేసింది.

'అదే నేనుచేసిన బుద్ధి తక్కువ పని. తెల్లతోలు, తీరైన కనుముక్కు చూసి నీ వల్లో పడిపోయాను'

'ఖర్చులపేరుతో అందుకున్న కట్నం మాటో?'

'ఔను అది కూడానూ. అన్నీ ఎరగావేసి నన్ను గేలానికి పట్టాడు మీ నాన్న'

'ఎందుకలా నోరుపారేసుకుంటారు? మొదట్నుంచీ నాకు ఇలా వుండడం అలవాటైంది. మా నాన్నగారు పల్లెటూళ్లో డాక్టరని తెలుసుగదా. పెద్దింటిపిల్లలమని ఎక్కువగా ఎవరింటికీ వెళ్లనివ్వలేదు. అదే నాకు అలవాటైంది. ఆమె... వసంత.. హాస్టల్లో వుండి చదువుకుంది. నలుగుర్లో కలిసిమెలిసి తిరిగింది. ఆమెతో నాకు కంపేరిజనేంటి? ఆమెని నాలా రిజర్వ్‌డ్‌గా ఒక్కరోజు వుండమనండి చూద్దాం'

'ప్రతీదానికి సమర్ధించుకుంటావ్. నా కోసం నువ్వు మారచ్చుగా?"

'అలా అడిగితే నేను మాత్రం కాదంటానా? ఎవరో ఏదో అన్నారని నన్నంటే ఏం చెప్పేది? ఐనా మీ ఫ్రెండ్స్‌ని నేనెప్పుడూ ఇన్సల్ట్ చేయలేదు. నాకు చేతనైన రీతిలో గౌరవించాను. ఇక వాళ్లు నా గురించి కామెంట్స్ చేయడమంటారా, అది మీరు వాళ్లలో నాపట్ల క్రియేట్‌చేసే ఇమేజిని బట్టి వుంటుంది."

అక్కడితో ఆ వాదన ఆగిపోయిందిగానీ ఇద్దరికీ మధ్యని ఎప్పుడూ సంఘర్షణే. కల్చర్ క్లాషే. ఆమె పల్లెటూళ్లో పుట్టి పెరిగింది. అతనిది మొదటి నుంచీ సిటీలైఫ్. ఫ్రెండ్సు, పార్టీలు.. ఓహ్! ఎప్పుడూ బిజీగా వుంటాడు. పెళ్లి గురించి పెద్దగా అవగాహన లేకుండానే సుధని తండ్రి ప్రపోజ్ చేస్తే చేసుకున్నాడు.

పెళ్లయి తనింటికి వచ్చిన భార్య తనతో కొంత జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని తెచ్చుకుని వచ్చిందనీ, అవామెకి పుట్టింటివారిచ్చిన కట్నకానుకలకన్నా ముఖ్యమైనవనీ అనుకోడు. ఆమె వుపనది, తను నది. ఆమెని తనలో కలిపేసుకుకోవాలని అతనికి తపన. కానీ ఆమెలో అలాంటి ఫ్లెగ్జిబులిటీ అతనికి కనిపించదు. అందరూ ఇంతేనా? లేక తన ఒక్కడి విషయంలోనే ఇలా జరిగిందా అనే ఆవేదన లోంచి పుట్టుకొచ్చిన తపన - ఆమెని తన అభిరుచులకి అనుగుణంగా మలచుకోవాలని అతన్లోని విచక్షణని చంపేస్తోంది. ఆమె ఎంత బలంగా తన వ్యక్తిత్వాన్ని పరిరక్షించుకుంటోందో అతనంత సమవుజ్జీగా ఆ రక్షణ కవచాన్ని మాటల్తో తూట్లు పొడుస్తాడు. ఫలితంగా పెళ్లంటే ఇద్దరికీ ఒక వికృతార్థం గోచరించడం మొదలైంది. సహజీవనం పాము ముంగిసా ఆటలా తయారైంది.

★★★

'వచ్చే సండే వన భోజనాలకి ఏర్పాట్లన్నీ దీక్షిత్ చూస్తున్నాడు. ఎంతదాకా వచ్చాయో కనుక్కుని వస్తాను. నువ్వు వస్తావా?' అడిగాడు ప్రసాదు భార్యని.

వస్తానన్నా అతన్తో చిక్కే. రానన్నా చిక్కే. అతని నాలుక రెండువైపులా పదునున్న కత్తిలాంటిది. చాలా డెలికేట్‌గా వుంది సుధ పరిస్థితి.

'ఐదు నిముషాల్లో తయారైరా. బైట వెయిట్ చేస్తుంటాను.' ఆమె తీసుకోవాల్సిన నిర్ణయాన్ని తనే చెప్పేసి స్కూటర్ తాళం తీసుకుని పోర్టికోలోకి నడిచాడు.

ఇంట్లో వున్నా సుధ ఎప్పుడూ నీట్‌గా డ్రెస్సయ్యే వుంటుంది. చాలా మంది ఆడవాళ్ళలాగ వున్న చీరలన్నీ బీరువాకి అంకితం చేసి ఒకటో రెండో పాత చీరల్తోటో, నైటీల్తోటో కాలక్షేపం

చేయడం ఆమెకి నచ్చదు. ఎప్పుడు చూసినా అప్పుడే కోసిన గులాబీలా ఫ్రెష్‌గా వుంటుంది. అందుకే భర్త చెప్పినదానికంటే ముందుగానే లాక్‌చేసి బైటపడింది.

ఇద్దరూ వెళ్లేసరికి వసంతా, దీక్షిత్ పెద్దగా అరుచుకుంటున్నారు. బెడ్రూమ్‌లో వున్నారేమో, వీళ్లొచ్చిన అలికిడి కూడా గుర్తించలేదు.

'ఆడ్ టైమ్‌లో వచ్చినట్టున్నాం. వెళ్లిపోదాం' అంది సుధ వెనుతిరుగుతూ. ప్రసాద్ ఆమెను అనసరించేవాడే. కానీ ఆగిపోయాడు, దీక్షిత్ వసంతల సంభాషణల్లో తమ గురించి వినిపించడంతో.

'నువ్వింకా కాలేజి డేస్‌లోనే వున్నానుకుంటే ఎలా? ప్రసాద్ భార్య చూడు, ఎంత డిగ్నిఫైడ్‌గా వుంటుందో? ఎంతో రిజర్వ్‌డ్‌గా వుంటుంది. ఐనాసరే, వాడా అమ్మాయిని గురించి అందరికీ చెప్పుకుని ఏడుస్తాడు. నాకలా నలుగుర్లో నీ గురించి చులకనగా మాట్లాడడం ఇష్టం వుండదు. అందుకే నీకే చెబుతున్నాను. నీ పద్ధతి మార్చుకుంటే బాగుంటుంది.'

గుమ్మం దాటుతున్నదల్లా సుధ కూడా ఆగిపోయింది. ఒక్క క్షణం పాటు వెనక్కి తిరిగి భర్తకేసి చూడకుండా వుండలేకపోయింది. ఆమెకి మనసెంతో తేలికైనట్టు అనిపించింది. ప్రసాద్ వసంతని ప్రశంసిస్తున్నాడు. దీక్షిత్ తనని... ఇదే మగ బుద్ధా?

ఆమెకి నవ్వు వచ్చింది.

ప్రసాద్‌కి మాత్రం తనెంతో ఎడ్మైర్ చేసే వసంతని దీక్షిత్ అలా అనడం నచ్చలేదు. ఇంతలో ఖంగుమని వసంత గొంతు వినిపించింది.

'నా పద్ధతులు నావి. నేను అందరితో ఫ్రీగా మాట్లాడతానుగానీ అసభ్యంగా మాట్లాడనే? ఐ నో హౌటు బిహేవ్'

తల గిర్రుమని తిరిగినట్లైంది ప్రసాద్‌కి. ఇదమిద్ధమని తెలీని కొన్ని భావాలు ముంచెత్తి అతన్ని ఉక్కిరిబిక్కిరి చేసాయి. వాటినొక క్రమంలో పెట్టుకోవడానికి అతనికి కొంత వ్యవధి పట్టింది.

వసంత.. తనెంతో ఉన్నతంగా భావించే వసంత... సుధ మాట్లాడినట్టే మాట్లాడి తన వ్యక్తిత్వాన్ని ప్రకటించుకుంటోంది. సుధ రిజర్వ్‌డ్‌గా వుండడం తనకి నచ్చనట్టే వసంత ఫ్రీగా వుండడం దీక్షిత్‌కి నచ్చడంలేదు. తనలాగే అతనూ ఆమెనంటున్నాడు. తన భార్యలాగే ఆమెకూడా వ్యక్తిత్వాన్ని పరిరక్షించుకుంటోంది. ఇక వాళ్లిద్దరికీ తామిద్దరికీ ఏమిటి తేడా? ఆమె సుధకన్నా ఎందులో ఎక్కువ?

'వెళ్లిపోదాం పదండి. వాళ్ల మాటలు మనం విన్నట్టు తెలిస్తే బావుండదు' అతని చెయ్యిపట్టుకుని తీసికెళ్ళిపోయింది సుధ.

తిరిగొచ్చేస్తుంటే అతనికనిపించింది. సుధ కొత్తగా పరిచయమైనట్టు. కుతూహలంగా చూసాడు ఆమెని. ఒక ఆత్మీయతా భావం జనించింది. అది వెన్నెల కిరణంలా అతని మనసులో ఆమెపట్ల అయిష్టతగల కోణాల్లోకి చొచ్చుకుపోయి ఆక్రమించుకుంది.

★★★

వసంతని మరో యాంగిల్లోంచి కూడా తను చూస్తాడని ప్రసాద్ అనుకోలేదు. అదో చిత్రమైన పరిస్థితి. పైకి ప్రశాంతంగా కనిపించే నదికింద సుడులుంటాయనీ, మెత్తగా అందంగా వుండే గులాబీ కాడకి ముళ్లుంటాయనీ, ప్రతీవాళ్లకి అనుభవంమీదే తెలుస్తుంది. అతనిక్కూడా అంతే.

దీక్షిత్ కోసం అతనింటికి వెళ్లాడు. తీరా వెళ్తే అతడు లేదు. వసంత ఒక్కర్తే వుంది. టీవీ చూస్తోంది. వెళ్లిపోదామనుకుంటుంటే 'రండి, లోపలికి' అని ఆహ్వానించింది.

రాత్రి ఎనిమిదిన్నర గంటలవేళ ఆమె ఒక్కర్తే వుండగా తనెళ్ళి కూర్చోడం అంత బావుండదేమో అనిపించినా తన సంస్కారాన్ని తక్కువ అంచనా వేస్తుందేమోనన్న భయంతో వెళ్లి కూర్చున్నాడు.

సమాజంలో కొన్నిస్టాండర్డ్స్ ఎస్టాబ్లిషై వున్నాయి. ఇష్టంలేనివీ, నైతికవిలువలని అతిక్రమించేవీ అయిన ఎన్నో పన్లని మేల్ ఇగో కోసం చేస్తారు మగవాళ్లు. అలాగే వాళ్లుచేసే పనులని పంటి బిగువని భరించడం సహనం అనుకుంటుంది స్త్రీ. రెండూ ఓ రకంగా ఇన్‌హిబిషన్సే.

ఇద్దరూ కబుర్లలో పడి కాలానికి కళ్లెం వదిలేసారు. హటాత్తుగా గుర్తొచ్చి టైమ్ చూసుకుని వెళ్తానని లేచాడు ప్రసాద్.

'కూర్చోండి మీ ఫ్రెండు ఇప్పుడప్పుడే రాడు, భయపడక్కర్లేదు' నవ్వుతూ అంది వసంత.

'అంత భయపడే పని మనమేం చేయడంలేదుగా' ఆమె మాటల్లోని లోతుపాతులు పట్టించుకోకుండా కేజువల్‌గా అన్నాడు.

'చేస్తే తప్పేంటి? తప్పనుకుని చేస్తేనే భయం.' వసంత మాటలకి అతను స్టన్నయ్యాడు. ఏ వుద్దేశంతో ఈ మాటలంది? దిగ్భ్రాంతిగా ఆమె ముఖంలోకి చూసాడు. ఆమె కళ్లలో కాంక్ష స్పష్టంగా కనిపిస్తోంది.

సోషల్‌గా వుండడం తప్పుకాదన్న నమ్మకంతో ఆడామగా ఫ్రీగా వున్నప్పుడు దాని పర్యవసానం కూడా తప్పుకాదనుకోవాలి. స్త్రీ పురుషుల మధ్య ప్రకృతి సహజమైన ఆకర్షణ వుంటుంది. సామాజిక బంధనాల దృష్ట్యా అది మనసులో ఏ అట్టడుగు పొరల్లోకో మరే చీకటికోణాల్లోకో జారుకుని నిగూఢంగా వుండిపోయినప్పటికీ ఎప్పుడో ఒకప్పుడు బహిర్గతమవక మానదు. వసంతకి ప్రసాద్ మేన్లీనెస్ ఎంతో నచ్చింది. వంటరి రాత్రి ఏకాంత భావన ఆమెలో అతనిపట్ల అంతర్గతంగా వున్న ఆరాధనని గాలంవేసి లాగుతోంది. కూర్చున్న దగ్గర్నుంచి లేచి వచ్చి అతని పక్కని కూర్చుంది. ఆమె స్పర్శ, ఆమె శరీరంనుంచి వస్తున్న పరిమళాలు... అతన్ని వివశుణ్ణి చేస్తున్నాయి. చాలా కష్టంమీద తనని తాను నియంత్రించుకుంటున్నాడు.

'సమాజంలోనూ వివాహ వ్యవస్థలోనూ భాగస్వామియైన స్త్రీ ఇష్టాయిష్టాలని మనవాళ్ళు ఏ విషయంలోనూ మన్నించరు. పెళ్ళి విషయంలో సరేసరి. దీక్షిత్‌ను నేను కొంత అయిష్టంగానే ఒప్పుకున్నాను. అతను చెడ్డవాడని కాదు. నాకతన్తో పెళ్లి చేసుకోవాలనిపించేంత ఆకర్షణ కనిపించలేదు. కానీ నాకతన్తో పెళ్లైంది. గుండెల్నిండా ఏదో అసంతృప్తి. మిమ్మల్ని చూసాక...'

అప్పటికి తేరుకున్న అతనామె మాటల్ని మధ్యలోనే కట్ చేసాడు. 'మీ అర్జ్ వెనకాల కారణం ఏదైనా కావచ్చు. మీరు పెళ్లికాని అమ్మాయైనా, కనీసం దీక్షిత్ భార్య కాకపోయినా మిమ్మల్ని డిసప్పాయింట్ చేసేవాడిని కాదేమో' అంటూ లేచి నిల్చున్నాడు. 'పెళ్లికీ వివాహ వ్యవస్థకీ ఆధారం పవిత్రతే. అయిష్టంగా పెళ్లిచేసుకున్నాని అసంతృప్తి పెంచుకుని జారుడుమెట్లమీద ప్రయాణం చేసేకంటే డైవర్సన్ని వెతుక్కోవడం మంచిది' అనేసి గబగబ బైటపడ్డాడు.

అతనికో విషయం చాలా స్పష్టంగా అర్ధమైంది. ఎంతో సంక్లిష్టంగా మరెంతో నిగూఢంగా వుండే మానవ ప్రవృత్తిలో ఇద్దరు వ్యక్తులకి అంతరంగిక సాన్నిహిత్యం వుండడం చాలా అరుదు. ఎంతో అన్యోన్యంగా వుండే భార్యాభర్తలకి కూడా ఏవో అరమరికలుంటాయి. అంతరంగిక మిత్రులు కూడా టచ్ చేసుకోని విషయాలుంటాయి. అలాంటప్పుడు ఒక వ్యక్తిని మరొకరు పరిచయం చేసినపుడు వాళ్ల క్రియేట్ చేసిన ఇమేజి అలాగే వుంటుంది. ఎప్పుడో ఇలాంటప్పుడే అది మారుతుంది.

దీక్షిత్ వసంతని పరిచయం చేస్తూ 'నా మిసెస్ డబుల్ పిజి' అన్నాడు. ఆమె చాలా ఎడ్యుకేటెడ్ అనే భావన కలిగింది తనకి. ఆమె చాలా సోషియబుల్ అన్నాడు తర్వాత. ఆమేదో ఆకాశంలోని దేవత.. తమ మధ్య విహరించడానికొచ్చిందనిపించింది. తనే కాదు, తమ సర్కిల్లో అంతా అంతే!

మరి తను?

సుధని పుస్తకాల పురుగనీ, అర్థమైన చెత్తా చదివే వేస్ట్ కేండిడేటనీ అందరికీ చెప్పాడు. అంతా ఆమెనదే దృష్టితో చూస్తున్నారు. అదే ఆమెని తనొక ఇంటలెక్చువల్‌గా చెప్పివుంటే ఆమె విలువ మరోలా ఎస్టాబ్లిషై వుండేది.

ఇమేజి!ఎవరెలా ప్రెజంట్ చేస్తే అలా!

థౌజండ్ రిగ్రెట్స్ టూ సుధా! - అనుకుంటూ ఇంటిదారి పట్టాడు.